నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 8 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్

వాంకిడి, మార్చి 7 : పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. గురువారం వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి సందర్శించారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. పరీక్షల సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తనిఖీలు చేశాకే కేంద్రంలోకి అనుమతించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని పరిష్కరించాలని తహసీల్దార్ డీ.రోహిత్‌కు సూచించారు.

## విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీసీపీ అశోక్ కుమార్

మంచిర్యాల అర్బన్, మార్చి 7 : విద్యార్థులు సైబర్ క్రైం భారీన పడకుండా అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైం సెక్యూరిటీ మీద అవగాహన సదస్సు, మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మహిళా అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఐ రవీందర్, కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రాజు, ప్రిన్సిపాల్ పీ ఉపేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు, డైరెక్టర్ ఎం విజయ్‌కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తలు


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, వేదికపై బీఆర్‌ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మంచిర్యాల, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య

# గులాబీ జెండా ఎగరాలే..

## ప్రతి ఒక్కరూ గెలుపే లక్ష్యంగా కష్టపడి పనిచేయాలి

## కాంగ్రెస్ '420' హామీలను ఎండగట్టాలి

● మూడు నెలల్లోనే సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ● బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు హస్తం, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం

● మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

● నస్పూర్‌లో మూడు నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తలతో సమావేశం

● హాజరైన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య

సీసీసీ నస్పూర్, మార్చి 7 : పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరాలని, ఇందుకు కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం నస్పూర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తల సమావేశానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యతో కలిసి హాజరయ్యారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఈ మూడు నెలల పాలనలో ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. అధినేత కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చారని, పదేళ్లలో ప్రగతి పథంలో నడిపించి దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందని, ప్రజలంతా కేసీఆర్ పాలననే గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓడించడానికి బీజేపీతో కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుందని ఆరోపించారు. పార్టీకి కార్యకర్తలే బలం.. బలగమని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ '420' హామీలిచ్చి, విస్మరిస్తున్న తీరును ప్రజలకు వివరించాలని సూచించారు. 26 ఏళ్లు సింగరేణి కార్మికుడిగా పనిచేశానని, కార్మిక ఉద్యోమాల్లో పాల్గొని జైలుకు వెళ్లానని చెప్పుకొచ్చారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేశానని, ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచి, కాంగ్రెస్ చెంప చెల్లుమనేలా సమాధానమివ్వాలని కోరారు.

**అక్రమ కేసులకు భయపడం :**

**బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్**

కక్షసాధింపుతో పెట్టే అక్రమ కేసులకు భయపడేది లేదని, కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ విప్, బీఆర్‌ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ భరోసానిచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను బీఆర్‌ఎస్ పార్టీ సీరియస్‌గా తీసుకుందని, ఈ నెల 13న చెన్నూర్ నియోజకవర్గం, 14న బెల్లంపల్లి నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలతో పాటు సోషల్ మీడియా వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని సింగరేణి కార్మిక బిడ్డ, కార్మికక్షేత్రంలో విశేష అనుభవమున్న ఉద్యమ నాయకుడు కొప్పుల ఈశ్వర్‌కు కేటాయించడంతో ఇతర పార్టీల్లో గుబులు మొదలైందన్నారు. కాంగ్రెస్ పార్టీ, బీజేపీతో లోపాయికార ఒప్పందం కుదుర్చుకుని, బీజేపీ పార్టీ నుంచి పెద్దపల్లి స్థానానికి డమ్మి అభ్యర్థిని పెట్టాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆయన ఆరోపించారు. బీజేపీకి ధమ్ముంటే బలమైన అభ్యర్థిని కేటాయించాలని డిమాండ్ చేశారు. 14 ఏండ్లు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో బీఆర్‌ఎస్ ఒక బలమైనా శక్తిగా ఎదిగిందన్నారు. పార్టీకి వనరులు, వసతులకు కరువులేదని, లక్షలాది మంది కార్యకర్తలు కమిట్‌మెంట్‌తో పనిచేస్తున్నారని అన్నారు. ఏనాడూ గెలుపుతో పొంగిపోలేదు.. ఓటమితో కుంగిపోలేదన్నారు. పోలీసులు ఏకపక్షంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతున్నారని, ఉద్యమంలో వందలాది కేసులకే తాము అదరలేదు.. బెదరలేదని గుర్తు చేశారు. తమ కార్యకర్తల తప్పులు లేకున్నా కేసులు పెడితే హెచ్‌ఆర్‌సీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్, కోర్టులను ఆశ్రయిస్తామన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, పోలీసులు, అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు. కాంగ్రెస్ సర్కారు 420 హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఈ విషయమై ప్రజల్లో చర్చ పెట్టాలని సూచించారు. తమపై ఉన్న కోపంతో ప్రజలకు అన్యాయం చేస్తామంటే ఊరుకునేదిలేదని, రూ. 1500 కోట్లతో మంజూరు చేసిన చెన్నూర్ ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలని చూస్తే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి అసలు ముఖ్యమంత్రిగా వ్యవహరించడంలేదని, రాష్ట్రాన్ని పరిపాలించే తెలివిలేక మేడిగడ్డ ప్రాజెక్ట్ పేరుతో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్‌లో తెలంగాణ వాణిని వినిపించాలంటే బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లి ఎంపీ సీటు గెలిపించి కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇవ్వాలని కోరారు. ఈ పార్లమెంట్ స్థానానికి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో లక్ష మెజార్టీ తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**హామీల అమలులో కాంగ్రెస్ విఫలం :**

**మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు**

కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. గతేడాది యాసంగికి నీరు పుష్కలంగా ఉంటే.. ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో సాగుకు నీరు అందించలేని దుస్థితి నెలకొందన్నారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ గేట్లు కుంగిపోయాయని విషప్రచారం చేస్తుందని మండిపడ్డారు. గతేడాది నిండుకుండలా ఉన్న గోదావరిని ఎండిపోయేటట్లు చేశారని, మరమ్మతులు చేసి నీరు విడుదల చేయలేక కాలయాపన చేస్తూ రైతుల పాలిట శాపంగా మారుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పార్టీకి ఎదురులేదని, కేసీఆర్‌పై ప్రజలకు అపారమైన నమ్మకం ఉందన్నారు. కార్యకర్తలు కసితో పనిచేసి ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

**హ్యాట్రిక్ విజయం కోసం కృషి :**

**బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

పార్లమెంట్ ఎన్నికల్లో రెండుసార్లు బీఆర్‌ఎస్ విజయం సాధించిందని, ముచ్చటగా మూడోసారి గెలిపించుకొని హ్యాట్రిక్ సాధిస్తామని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ధీమా వ్యక్తం చేశారు. గెలిచిన రెండు సార్లు మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుంచి భారీ మెజార్టీ వచ్చిందని గుర్తుచేశారు. ప్రతి కార్యకర్త తానే ఎన్నికల్లో పోటీ చేస్తున్నాననే భావనతో ప్రచారం కొనసాగించాలని సూచించారు. పార్టీని నిలబెట్టుకోవాలనే భావన ప్రతి ఒక్కరిలో ఉందని, ఇదే పట్టుదలతో రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లాలోని జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# శివపూజకు వేళాయే..

● నేడు మహా శివరాత్రి వేడుకలు ● ముస్తాబైన శైవక్షేత్రాలు ● వేలాదిగా తరలిరానున్న భక్తులు

● అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీలు


బెల్లంపల్లి రూరల్ : బుగ్గ గర్భగుడిలోని రాతి శివలింగం


జైపూర్ : వేలాల గుట్టపై ఏర్పాటు చేసిన క్యూలైన్లు

నమస్తే నెట్‌వర్క్, మార్చి 7 : మహాశివరాత్రికి శైవక్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. మంచిర్యాల జిల్లాలోని గోదావరి తీరం వెంట శివాలయాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ప్రసిద్ధ వేలాల మల్లన్న, కత్తెరశాల మల్లికార్జున, బుగ్గ రాజరాజేశ్వర స్వామి, ఆసిఫాబాద్ జిల్లా ఈస్‌గాం శివమల్లన్న తదితర ఆలయాల కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. శివ పార్వతుల కల్యాణోత్సవానికి భక్తులు వేలాదిగా తరలిరానుండగా, ఆయా ప్రాంతాలకు ఆర్టీసీ.. బస్సులు నడిపిస్తున్నది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.

## ప్లాట్లు ఉచితంగా క్రమబద్ధీకరించాలి

● ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

● కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతి పత్రం అందజేత


ఆసిఫాబాద్ : కలెక్టర్ దోత్రేకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, మార్చి 7 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ప్లాట్లను క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎల్‌ఆర్‌ఎస్‌లో రుసుములు విధించకుండా.. పూర్తి ఉచితంగా అమలయ్యేలా చూడాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కేసీఆర్ సర్కారు 2022 నుంచి ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేసేందుకు జీవోఎంఎస్ 135ను విడుదల చేసిందని గుర్తు చేశారు. దీని ప్రకారం భూ వైశాల్యానికి అనుగుణంగా స్లాబులు నిర్ణయించి ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో ఉన్న పేదలకు అందుబాటు ధరల్లో ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలో వస్తే ఎల్‌ఆర్‌ఎస్‌లో విధించిన రుసుములు మొత్తం రద్దు చేస్తామని, ఉచితంగా పట్టాలు ఇస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించి.. ఇప్పుడు మాట మార్చడం సరికాదని మండిపడ్డారు. సామాన్యులకు నష్టం కలిగించే జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్‌హైమద్, ఆసిఫాబాద్, జైనూర్ మండలాల అధ్యక్షులు గంధం శ్రీనివాస్, ఇంతియాజ్‌లాలా, నాయకులు బుర్స పోచ్చయ్య, సాంగ్డె జీవన్, భీమేశ్, నిసార్, అశోక్ ఉన్నారు.

**ఎల్ ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి**

నస్పూర్, మార్చి 7 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు, చిన్నయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయకుండా ప్రజలపై ఆర్థిక భారం మోపాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని, ఇది సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.


నస్పూర్‌లో..

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు

ఆసిఫాబాద్, మార్చి 7 : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ధర్నా చేశారు. కార్మికుల వేతనాలు, కోడిగుడ్లు, టిఫిన్స్ బిల్లులను వెంటనే ఇవ్వాలని, రూ. 10 వేల వేతనం అమల్లోకి తీసుకురావాలని కోరారు. కార్మికులు అప్పుల ఊబిలో కూరుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సత్వరమే స్పందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షురాలు కే శారద, గౌరవ అధ్యక్షుడు వెలిశాల క్రిష్ణమాచారి, కార్యదర్శి పీ మాయ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ ఉన్నారు.

## షరతుల్లేకుండా రెగ్యులర్ చేయాలి

ఆసిఫాబాద్,మార్చి7 : నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట సంఘం అధ్యక్షుడు దివాకర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఉపేందర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. నాయకులు చిరంజీవి, ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, నాయకులు భూదేవి, సునీత, ఆర్బీఎస్‌కే డాక్టర్లు, సిబ్బంది రాకేశ్, శ్రీకాంత్, కౌటిల్య, కీర్తి, సౌమ్య, అన్నపూర్ణ, ముస్తక్, మాయ పాల్గొన్నారు.

## స్థానికంగా ఉండరు..
# సమస్యలు పట్టించుకోరు

● చుట్టపు చూపుగా వచ్చి వెళ్తే ఎలా?

● ఎమ్మెల్యే గడ్డం వినోద్ తీరుపై ప్రజల ఆగ్రహం


ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు సమస్యలు విన్నవించేందుకు ప్రయత్నిస్తున్న ప్రజలు

బెల్లంపల్లి, మార్చి 7 : బెల్లంపల్లి ఎమ్మెల్యేగా పదవీ బాధ్యతలు చేపట్టిన గడ్డం వినోద్ చుట్టపుచూపుగా నియోజకవర్గానికి వచ్చి వెళ్తున్నారని, తమ సమస్యలు చెప్పుకునేందుకు కనీసం సమయమివ్వడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. గురువారం బెల్లంపల్లి మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే వస్తున్నారని తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వినతులు ఇవ్వడానికి ఉదయం 11 గంటల నుంచి వేచి చూశారు. మధ్యాహ్నం 12.15 గంటలకు సమావేశ మందిరానికి చేరుకున్న ఆయన, హడావుడిగా వినతులు స్వీకరిస్తూ ముందుకెళ్లారు. దీంతో అక్కడున్న వారంతా అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ సమస్యలు విన్నవిద్దామంటే నిమిషమైనా ఆగకుండా వెళ్లడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదిహేను రోజులకోసారి ఇలా వచ్చి.. అలా వెళ్తున్నారని, తమ ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్థానికంగా ఉండాలని వేడుకుంటున్నారు.



















